**జరిగిన కథ :** ‘కాశీమజిలీలు వట్టి కథలు కావు. వేదశాస్త్ర పురాణాలతో కూడిన భారతీయ విద్యా ప్రపంచంలో.. శ్రేష్ఠమూ, శాశ్వత స్మరణీయమూ అయిన వస్తువులనే కథారూపంగా మధిర సుబ్బన్నదీక్షిత కవి వీటిలో పొందుపరిచారు’ అని పండితుల అభిప్రాయం. ప్రస్తుతం మీరు చదవబోయేది పన్నెండు భాగాల కాశీమజిలీ కథల్లో.. పదకొండో సంపుటిలోనిది.






# కాళిదాసు - జ్ఞానతీర్థుడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

ధారానగరాన్ని భోజరాజు పాలిస్తున్న కాలంలో.. ఆ నగరంలోనే అగ్నిశిఖుడనే చాదస్తపు వేదపండితుడు ఉండేవాడు.

అతను పూర్వాచారాలను ఆదరిస్తూ, కొత్త అలవాట్లను నిరసిస్తూ ఉండేవాడు. ఇతరులను యాచించకుండా ఉన్నంతలోనే కాలక్షేపం చేస్తుండేవాడు. భోజరాజు పండితులకు లక్షలకొద్దీ బహుమతులిస్తాడని తెలిసినా.. తన దరిద్రమే తనకు చాలనుకునేవాడు.

నిత్యకర్మలు లోపం లేకుండా చేస్తుండేవాడు. అధ్యయనమే కాకుండా తన వద్దకు వచ్చిన శిష్యులకు వేదం బోధిస్తుండేవాడు. ఎవరి ఇంటికీ భోజనానికి వెళ్లేవాడు కాదు. అరుగు విడిచి ఎన్నడూ పొరుగింటికి వెళ్లి ఎరుగడు. అతని భార్యపేరు దేవదత్త.

ఒకనాడు ఆమె తమ శిష్యుడినొకణ్ని పిలిచి..

‘‘అబ్బాయీ! మీ గురువుగారి చాదస్తం రోజురోజుకూ పెరిగిపోతున్నది. నాలుగురోజుల్లో మా మామగారి ఆబ్దికం రాబోతున్నది. ధర్మశాస్త్రంలో చెప్పిన ప్రకారం భోక్తలు దొరకడం లేదని.. చాలాకాలంగా మీ గురువుగారు తండ్రిగారికి చటక శ్రాద్ధమే తప్ప.. యథావిధిగా చేయడమే లేదు. పితృదేవతల అనుగ్రహం లేకపోవడం వల్లనే మాకు సంతానం కూడా కలగడం లేదు. అందుచేత ఈసారైనా మీ గురువుగారి పట్టుమాన్పించి ఏదో ఒక విధంగా తద్దినం పెట్టేలా చూడు’’ అని బోధించింది.

ఆ శిష్యుడు అగ్నిశిఖుని వద్దకు వెళ్లి..

‘‘గురుదేవా! మీరు ప్రయత్నిస్తే ఈ ఊరిలో మంచి భోక్తయే లభించడా?! తండ్రిగారి ఆబ్దికం నెరవేర్చకుండా ఎంతకాలం ఆగుతారు?’’ అని ప్రశ్నించాడు.

అందుకు అగ్నిశిఖుడు..

‘‘కౌశికా! నాకైతే ఈ ఊరిలో అర్చించదగిన భోక్తలు లభించడం లేదు. నీ ఎరుకలో ఉంటే చెప్పు’’ అన్నాడు.

‘‘గురువుగారూ! ఆబ్దికానికి ఎటువంటి భోక్తలు కావాలో చెప్పండి?’’ అని అడిగాడు.

‘‘రోగులను భోజనానికి పిలవకూడదు. వాళ్లకు మనం పెట్టిన అన్నం విషం కావచ్చు కనుక. వికలాంగులను పిలిచి కష్టపెట్టకూడదు. అయితే, ఈ ఊరిలో ఉన్నవారిలో దుర్జనులు, కృతఘ్నులు కానివారెవరూ కనిపించడం లేదు. అందరిలోనూ ఏదో ఒక లోపం ఉండనే ఉంటున్నది. భోక్తలుగా రావాలంటే.. తొలిగా జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలి. ఆ తరువాత తాను నివసిస్తున్న సంఘక్షేమాన్ని కోరుకోవాలి. చిట్టచివరిగా వ్యక్తి ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించాలి. ఈ మూడురకాలుగా బతకు గడపడాన్నే ‘త్రిణాచికేత యజ్ఞం’ అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. దీనికి వైదిక ప్రక్రియలు కూడా ఉన్నాయి. వాటిని చేసినవాడు, వేదాంగాలు తెలిసినవాడు, అధ్యయనపరుడు, వేదార్థం ఎరిగి ఇతరులకు చెప్పగలిగేవాడు, బ్రహ్మచారి, యజ్ఞవేత్త, సత్యం పలికేవాడు, కళంకం లేని ప్రఖ్యాతమైన వంశంలో పుట్టినవారు.. ఇటువంటివారు ఏడుగురు కానీ, ఐదుగురు లేదా చివరికి ఇద్దరినైనా భోక్తలుగా నియమిస్తే పితృదేవతలు ఆనందిస్తారని శాస్త్రాలు బోధించాయి. అటువంటివారు ఈ భరతభూమిలో నేటికీ అడుగడుగునా ఉన్నారని కొందరు చెబుతుంటారు. కానీ, మన దురదృష్టం కాకపోతే మన ఊరిలో అటువంటివాడే లేడేమిటో?!’’ అన్నాడు అగ్నిశిఖుడు బెంగగా.

‘‘నాకొక రెండురోజులు గడువివ్వండి గురువుగారూ! ఎవరైనా దొరుకుతారేమో చూసి వస్తాను’’ అంటూ కౌశికుడు వెళ్లిపోయాడు.

చాలా ప్రయత్నించాడు. కానీ, గురువు విధించిన నియమాల ప్రకారం ఎవరూ లభించలేదు.

మూడోరోజున మధ్యాహ్నం తిరిగివచ్చి..

‘‘గురువుగారూ! సాధారణ ప్రజలలో మీరు చెప్పిన విధంగా బతుకుతున్నవాళ్లు ఒక్కళ్లూ కనిపించలేదు. అయితే నిన్ననే మన శివాలయానికి ఒక యతి వచ్చారట. ఆయన పేరు జ్ఞానతీర్థులని, చాలా మహిమ కలవారని విన్నాను. ఈసారి వారిని అర్చిస్తారా?’’ అని అడిగాడు. అందుకు గురువు సంతోషించి..

‘‘వెంటనే బయల్దేరుదాం పద’’ అన్నాడు.

ఇద్దరూ శివాలయానికి వెళ్లారు. జ్ఞానతీర్థులకు నమస్కరించారు.

‘‘మీ ఆకారం చూస్తే శ్రోత్రియుల్లా ఉన్నారు. ఏం పని మీద వచ్చారు?’’ అని అడిగాడు జ్ఞానతీర్థుడు.